క్లుప్తంగా...

నేడు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఈ నెల 29న నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. సమ్మేళనం కార్యక్రమంలో పార్టీ పరిస్థితి, కార్యకర్తల మధ్య సయోధ్య, డివిజన్‌లో జరిగిన అభివృద్ధి పనుల గురించి చర్చిస్తామని శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్, రాష్ట్ర నాయకుడు దాసోజు శ్రవణ్ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా.15, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 9, క్యారెట్ 13, దొండ 35, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 65, గోకరకాయ 50, కీర 15, దోసకాయ 25, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 18, చామగడ్డ 55, మొరంగడ్డ 15, కందగడ్డ 35, సొరకాయ 13, పొట్లకాయ 15, అరటికాయ 10, మునగకాయ 4–6, ముల్లంగి 3–5. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న జక్కుల మహేశ్వర్‌రెడ్డి

రసూల్‌పురా: పేదల ఆరోగ్యం పాలిట సంజీవనిలా సీఎం సహాయనిధి తోడ్పాటునందిస్తున్న కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఒకటో వార్డు న్యూబోయిన్‌పల్లి చిన్నతోకట్ట సంజీవయ్య కాలనీకి చెందిన అంజయ్య, సాయి కుమార్, శ్రవణ్‌లకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం ఆయన అందజేశారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో బి. రాజు, టింకు, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిని కూల్చివేసిన దుండగులు



సనత్‌నగర్: బేగంపేట బ్రాహ్మణ వాడీలో బీఎస్‌ఎన్‌ఎల్ మాజీ ఉద్యోగి వెంకటేశ్వర్‌కు చెందిన ఇంటిని గుర్తుతెలియని వ్యక్తులు కూల్చివేశారు. కుటుంబ సభ్యులు శుభకార్యం నిమిత్తం తాళం వేసి కూకట్‌పల్లికి వెళ్లారు. సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి పైకప్పు, ప్రహరీని కూల్చివేశారు. మంగళవారం ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో బంగారు, వెండి వస్తువులు కూడా కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వేణుగోపాల్‌రెడ్డికి సేవారత్న అవార్డు



నాగబాబు నుంచి అవార్డు అందుకుంటున్న వేణుగోపాల్‌రెడ్డి

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటకు చెందిన చిరంజీవి అభిమాన సంఘం రాష్ట్ర నాయకులు పి. వేణుగోపాల్‌రెడ్డి నాగేంద్రబాబు చేతుల మీదుగా సేవారత్న అవార్డును అందుకున్నారు. హీరో రామ్‌చరణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా ఇటీవల శిల్పకళా వేదికలో జరిగిన కార్యక్రమంలో చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ద్వారా అత్యధికంగా రక్తదాన శిబిరాలు నిర్వహించిన వారికి, పలు సేవా కార్యక్రమాలు చేపట్టిన వారికి విశిష్ట సేవారత్న అవార్డులు అందజేశారు. ఇందులో భాగంగానే వేణుగోపాల్‌రెడ్డి ఈ అవార్డును అందుకున్నారు.

మహిళలకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ అవసరం

- మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ: ఆత్మరక్షణ కోసం పాఠశాల స్థాయి నుంచే మహిళలకు మార్షల్ ఆర్ట్స్ (కరాటే)లో శిక్షణ అవసరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం ఓయూ సైన్స్ కాలేజీ ఆడిటోరియంలో మూడు ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం జరిగింది. కార్యక్రమానికి ఎన్‌జీవోఎస్ అధ్యక్షులు జ్ఞానేశ్వర్ అధ్యక్షత వహించగా మహిళ వర్సిటీ వీసీ ప్రొ.విజ్జులత, ఓయూ వీసీ ప్రొ.రవిందర్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి, ప్రొ.లక్ష్మీనారయణ, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు మమత, ఓయూ నాయకులు ప్రణీత, షర్మీల, హైమావతి, తదితరులు పాల్గొని ప్రసంగించారు.

దేవుడికే శఠగోపం!

- గుడిలోని 7 కిలోల వెండి ఆభరణాలు మాయం
- అప్రైజింగ్‌లో బట్టబయలు
- బయటకు పొక్కకుండా జాగ్రత్తలు
- గుట్టుచప్పుడు కాకుండా తయారు చేయిస్తున్నట్లు సమాచారం



రాంగోపాల్‌పేట్: అవకాశం వస్తే గుడిలోని లింగాన్ని మింగేస్తాడనే సామెత ఇక్కడ అర్చకులకు సరిగ్గా సరిపోయింది. భగవంతుడికి భక్తుడికి మధ్య అనుసంధానంగా ఉంటూ కనిపించే దేవుడిగా భక్తులు కొలిచే అర్చకుడే దేవుడి ఆభరణాలకు ఎసరు పెట్టాడు. సుమారు 7 కిలోల వెండి ఆభరణాలు మాయం కాగా జువెలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ ఆభరణాల అప్రైజింగ్‌కు రావడంతో ఈ విషయం బయట పడింది. ఇందులో వివిధ స్థాయిలో ఉండే అధికారుల నిర్లక్ష్య వైఖరి ఉండటంతో బయటకు వస్తే అందరికి శిక్ష పడుతుందనే భయంతో అందరూ తేలుకుట్టిన దొంగల్లా మిన్నకుండిపోయారు. మాయం చేసిన బంగారు ఆభరణాలు తీసుకుని రావాలని ఆ అర్చకుడికి సమయం ఇచ్చినట్లు సమాచారం. ఈ ఘటన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఉండే చరిత్రాత్మకమైన గణపతి దేవాలయంలో జరిగింది.

అప్రైజింగ్‌తో వెలుగులోకి..

అన్ని దేవాలయాల్లో ఉండే బంగారు, ఆభరణాలను లెక్కించి వాడుకలో లేని వాటిని కరిగించి వాటిని అధికారులు బ్యాంకుల్లో ఉంచుతున్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 14,1 5వ తేదీల్లో సికింద్రాబాద్ గణపతి దేవాలయంలో అప్రైజింగ్ జరిగింది. జువెలరీ వెరిఫికేషన్ అధికారిని అంజనాదేవి ఆధ్వర్యంలో ఈఓతో పాటు అధికారులు అప్రైజింగ్ నిర్వహించారు. ఈ వెరిఫికేషన్‌లో ఉప ఆలయంగా ఉండే హనుమాన్ ఆలయానికి చెందిన 7 కిలోల వెండి ఆభరణాలు కనిపించలేదు. అర్చకుడిని అడిగితే లాకర్‌లో ఉన్నాయని..ఇప్పుడు లేవని, తాళం చెవి లేదని పొంతనలేని సమాధానాలు చెప్పినట్లు తెలిసింది. మాయమైన ఆభరణాల్లో హనుమానుడి గద, రెండు కిరీటాలు, అర్ధ కవచం, బాణాలు, బొట్టు, పర్వతం లాంటివి ఉన్నాయి. ఈ ఆభరణాలను బయట విక్రయించినట్లు సమాచారం. దీంతో అర్చకుడికి గట్టిగా అడిగితే తనకు కొంత సమయం కావాలని ఆభరణాలను తిరిగి చేయించి తీసుకువస్తానని చెప్పాడు. ఇప్పుడు ఆభరణాలు బయట తయారు చేయించి వచ్చే నెలలో ఉండే అప్రైజింగ్‌లో అధికారుల ముందుకు తేవాలని ఆదేశించినట్లు సమాచారం. అలాగే మరో అర్చకుడు దాతలు ఇచ్చిన 10 కేజీల బంగారు ఆభరణాలు రిజిస్టర్‌లో నమోదు చేయకుండా వీటిని తన వద్దే ఉంచుకుని అప్పుడు అధికారులకు సమర్పించినట్లు తెలిసింది. వీటికి ఎలాంటి రసీదులు కూడా లేవని తెలిసింది.

అధికారుల్లో మౌనం ఎందుకో?

దేవాలయంలో ఆభరణాలు మాయం కావడం, మరో అర్చకుడు భక్తులు ఇచ్చిన ఆభరణాలను రసీదు ఇవ్వకుండా తన వద్ద ఉంచుకున్నా అధికారులు మాత్రం మౌనంగా ఉన్నారు. తీవ్రమైన ఇలాంటి విషయాల్లో అధికారులు ఎలాంటి చర్యలకు ఉపక్రమించకపోవడం గమనార్హం. గతంలో ఇదే దేవాలయంలో ప్రస్తుత జేవీవీ అంజనాదేవి ఈవోగా పనిచేశారు. ఆమె పనిచేసిన సమయంలోనే అర్చకుడికి ఆభరణాలు అప్పగించారు. ఆభరణాల రిజిస్టర్‌ను ఒక సూపరింటెండెంట్ నిర్వహిస్తుంటారు. నెలకోసారి అర్చకుల వద్ద ఉన్న ఆభరణాల గురించి ఆయన పరిశీలిస్తూ ఉండాలి. దీంతో ఈ విషయం బయటకు వస్తే అందరి మెడకు చుట్టుకునే అవకాశం ఉండటంతో అందరూ తేలు కుట్టిన దొంగల్లా మిన్నకుండి పోయారు. ఇక భక్తులు ఇచ్చిన ఆభరణాలను అనధికారికంగా తన వద్ద ఉంచుకున్న మరో అర్చకుడి విషయంలోనూ అధికారులు ఇలాగే వ్యవహరించారు. దీనిపై పూర్తి విచారణ చేస్తే మరెన్నో విషయాలు వెలుగులోకి వస్తాయని భక్తులు అంటున్నారు.

“ ఆభరణాలు చూపించలేదు..

అప్రైజింగ్ సమయంలో అర్చకుడి దగ్గర ఉండే వెండి ఆభరణాల గురించి అడిగినా ఆయన వాటిని మా వద్దకు తీసుకురాలేదు. ఆభరణాలు స్వామివారి మీద లేదా లాకర్‌లో ఉంచుకోవాలి. కానీ ఆయన లాకర్‌లో ఉన్నాయని, తాళం చెవులు లేవని చెప్పి ఆభరణాలను చూపించలేదు. ఏప్రిల్‌లో జరిగే పరిశీలనలో అవి ఉన్నాయో లేవో తెలుస్తుంది. మరో అర్చకుడు వెండి, బంగారు ఆభరణాలు తీసుకుని వచ్చి ఇచ్చిన మాట వాస్తవమేనని వాటి రసీదులు ఉన్నాయో లేదో, అవి రికార్డుల్లో ఎక్కించారో లేదో తెలియదు.

–అంజనాదేవి, జువెలరీ వెరిఫికేషన్ అధికారి

“ ఆభరణాలు మాయం కాలేదు..

బంగారు ఆభరణాలు మాయమయ్యానే వాటిల ఎలాంటి వాస్తవం లేదు. ఇది కావాలనే కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారు. రసీదులు ఇవ్వకుండా ఆభరణాలు ఉంచుకున్నాడనే ఆరోపణలు అవాస్తవం. అన్నింటికీ రసీదులు ఉన్నాయి. ప్రస్తుతం మాయమైన ఆభరణాలను చూపిస్తారా అని అడిగితే మాత్రం అప్రైజింగ్ జరిగే సమయంలో మాత్రమే చూపిస్తామని చెప్పడం గమనార్హం.

–వినోద్, ఈవో

అందరినీ కలుపుకొని ముందుకు సాగాలి

- మంత్రి తలసాని శ్రీనివాస్



మాట్లాడుతున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

రసూల్‌పురా: పార్టీ బలోపేతం, పటిష్టతకు చేపట్టే ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరినీ కలుపుకోవాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. ఆదర్శనగర్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో జిల్లా ఇన్‌చార్జి దాసోజు శ్రవణ్, మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇంచార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిశాంక్, బెవరేజేస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జేల నాగేష్, వైద్య మౌలిక సదుపాయల సంస్థ చైర్మన్ శ్రీనివాస్, దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తెలు నివేదిత, లాస్యనందితల ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. పార్టీ నాయకుల కార్యక్రమంలా కాకుండా ప్రజలతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలా ఉండాలని సూచించారు. పార్టీ అధిష్ఠానం త్వరలో కంటోన్మెంట్ నియోజకవర్గానికి ఇన్‌చార్జి నియామకం చేపడుతారన్నారు.

◆ మూడ్రోజుల క్రితం జరిగిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో తమకు ఏలాంటి సమాచారం లేదని చైర్మన్లు గజ్జేల నాగేష్‌తో సహా మిగిలిన ఇరువురు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యమకారులకు సమాచారం లేదని రంగా రవీందర్‌గుప్తా ఫిర్యాదు చేశారు. కార్యకర్తలు, ఉద్యమకారులను విస్మరించరాదన్నారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. సాయన్న మృతి తర్వాత పార్టీలో కొంత సమన్వయ లోపం ఉందనే ఉన్న మాట నిజమేనని అందరిని కలుపుకుని పార్టీ అభివృద్ధికి కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ హారిక ఆనంద్‌బాబు, వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు బి. ప్రభాకర్, నళిని కిరణ్, పాండు యాదవ్, భాగ్యశ్రీ, లోకనాథం. మాజీ చైర్మన్లు ఖదీరవన్, టిఎన్. శ్రీనివాస్, సీనియర్ నాయకులు ముప్పిడి మధుకర్, ప్రభుగుప్తా పాల్గొన్నారు.

జాతీయ ప్రార్థనా దినాన్ని విజయవంతం చేద్దాం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ రాజేశ్వరరావు

- ఎమ్మెల్సీ రాజేశ్వరరావు

రాంగోపాల్‌పేట్: ఏప్రిల్ 12వ తేదీన ఎల్బీ స్టేడియంలో క్రిష్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ ప్రార్థనా దినాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ రాజేశ్వరరావు పిలుపునిచ్చారు. రెజిమెంటల్‌బజార్‌లోని సీఎస్ఐ మెదక్ డయాసిస్ కార్యాలయంలో నగరంలోని వివిధ చర్చిలకు చెందిన పాస్టర్లు, బిషప్‌లు, ప్రతినిధులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. దేశ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం, ప్రజలందరు సుఖశాంతులతో ఉండాలని కోరుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రార్థనా దినాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఉన్న అన్ని డినామినేషన్లు, ఇండిపెండెంట్ సంఘాలకు చెందిన క్రైస్తవులందరు ఇందులో పాల్గొని ప్రార్థనలు చేస్తారని చెప్పారు. ఎలాంటి రాజకీయాలకు చోటు లేదని, క్రైస్తవులందరూ ఐకమత్యం చాటుతూ దేవునికి మహిమ కలిగేలా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనరల్ సూపరింటెండెంట్ అసెంబ్లీస్ ఆఫ్ గాడ్ మినిస్ట్రీస్‌కు చెందిన రెవరెండ్ పాల్ తంగయ్య క్రీస్తు సందేశాన్ని అందిస్తారని, మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు తదితరులు హాజరవుతారని చెప్పారు. తెలంగాణ ఫుడ్ చైర్మన్ రాజీవ్ సాగర్ మాట్లాడుతూ.. క్రైస్తవుల ఐక్యత కోసం చేసే ప్రతి ఒక్కరిని ప్రోత్సహించాన్నారు. దేశంలో మతతత్వ బీజేపీ ఒక వైపు క్రైస్తవులపై దాడులు చేస్తూ మరోవైపు వారు మావైపే ఉన్నారనేలా మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో లూథరన్ చర్చి పాస్టర్ ఎంఎస్ రావు, బీఆర్‌ఎస్ నాయకులు మోజస్, వివిధ సంఘాల ప్రతినిధులు జాన్ బాస్కో, ఆంటోని, సాల్మన్, సద్గుణ, శ్యాంసన్, బాస కృపానందం, లియోనార్డ్ లెవీస్ పాల్గొన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఇళ్ల కేటాయింపులో వస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలే



లబ్ధిదారులకు సంబంధించిన పట్టాలను చూపిస్తున్న బస్తీ కమిటీ నాయకులు

అడ్డగుట్ట: ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లోని డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపులో వస్తున్న ఆరోపణలు అవాస్తవాలేనని బస్తీ డెవలప్‌మెంట్ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఏసీఎస్‌నగర్ బస్తీలో కొందరు కుట్రపూరితంగా బస్తీ అభివృద్ధి కమిటీ ప్రతినిధులపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్లలో బినామీలకు కేటాయింపులు జరుగుతున్నాయని, డబ్బులు వసూలు చేస్తున్నారని తప్పుడు మాటలు సృష్టిస్తున్నారని అందులో ఏమాత్రం నిజం లేదని, బస్తీలో సంవత్సరాల తరబడి నివాసమున్న అర్హులైన పేద ప్రజలకు మాత్రమే ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. బస్తీలో తగినంత స్థలం లేని కారణంగా అర్హులందరికీ డబుల్ బెడ్రూమ్‌లు రాలేకపోయాయని, వారికి కూడా ఇతర ప్రాంతాల్లో కేటాయించేందుకు స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ కృషి చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో బస్తీ కమిటీ సభ్యులు పెండెం మనోహర్, కొండయ్య, స్వరూప, వేణుగోపాల్, వెంకటేష్, మల్లమ్మ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ జన్ ఆరోగ్య యోజన ప్రారంభం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్తీకరెడ్డి

అడ్డగుట్ట: ఆయుష్మాన్ భారత్ జన్ ఆరోగ్య యోజన పేద ప్రజలకు వరం లాంటిదని మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ జన్ ఆరోగ్య యోజన కార్యక్రమాన్ని మంగళవారం నార్త్‌లాలాగూడ శాంతినగర్‌లో ఆమె ప్రారంభించి మాట్లాడారు. పేదలకు రూ. 5 లక్షల వరకు ఉచిత వైద్యాన్ని అందించే ఆయుష్మాన్ భారత్ జన్ ఆరోగ్య యోజన పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సారంగపాణి, నాగేశ్వర్‌రెడ్డి, వీరన్న, ప్రకాష్‌గౌడ్, శారద మల్లేష్, శ్రీనివాస్, రాజేశ్వర్, బాబు, జ్యోతి, కృష్ణ, సాయి పాల్గొన్నారు.

ఉన్నత విద్యలో విస్తరిస్తున్న డిజిటల్ బోధన



మాట్లాడుతున్న ప్రొ.జగత్ భూషణ్‌నడ్డా

ఉస్మానియా యూనివర్సిటీ: ఉన్నత విద్య బోధనలో ప్రతి ఏటా డిజిటల్ విధానం విస్తరిస్తోందని కన్సార్షియం ఆఫ్ ఎడ్యుకేషన్ కమ్యూనికేషన్ న్యూఢిల్లీ (సీఈసీ) డైరెక్టర్ ప్రొ.జగత్‌భూషణ్ నడ్డా అన్నారు. మంగళవారం ఓయూ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో ఈఎంఎంఆర్‌సీ (ఎడ్యుకేషనల్ మల్టీ మీడియా రీసెర్చ్ సెంటర్) ఆధ్వర్యంలో మ్యాసివ్ ఆన్‌లైన్ కోర్సుల దృకల్పథం-ఉన్నత విద్యలో డిజిటల్ టెక్నాలజీ అనే అంశంపై రెండ్రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. కార్యక్రమానికి వీసీ ప్రొ.రవిందర్ అధ్యక్షత వహించగా సీఈసీ డైరెక్టర్ ప్రొ.జగత్ భూషణ్ నడ్డా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విశ్వవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్నత విద్యలో సంప్రదాయ బోధన పద్ధతి స్థానంలో డిజిటల్ విధానం విస్తరిస్తుందన్నారు. డిజిటల్ కోర్సుల్లో ప్రస్తుతం 27 శాతం ప్రవేశం పొందుతున్నారని 2035 నాటికి ఆ సంఖ్య 50 శాతానికి చేరుకుంటుందన్నారు. స్వయం (ఆన్‌లైన్) ద్వారా 40 క్రెడిట్లతో కూడిన మూక్స్ కోర్సులను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వెల్లడించారు.

మతం వ్యక్తిగత జీవన విధానంలో అంతర్భాగం



మాట్లాడుతున్న కొండ నాగేశ్వర్‌రావు

ఉస్మానియా యూనివర్సిటీ: మతం వ్యక్తిగత జీవన విధానంలో అంతర్భాగమని ఓయూ అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ కొండ నాగేశ్వర్‌రావు అన్నారు. వర్సిటీలో గత రెండ్రోజులుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లో ఇండియన్ కౌన్సిల్ ఫర్ హిస్టారికల్ రీసెర్చ్ (ఐసీహెచ్‌ఆర్) సహకారంతో రిలీజియన్ అండ్ సొసైటీ ఇన్ తెలంగాణ ఫ్రమ్ శాతవాహన టు కాకతీయాస్ అనే అంశం పై జరిగిన జాతీయ సదస్సు మంగళవారంతో ముగిసింది. కార్యక్రమానికి కొండ నాగేశ్వర్‌రావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.గణేష్, ప్రొ.అడపా సత్యనారాయణ, తదితరులు పాల్గొని అనేక అంశాలపై మాట్లాడారు.

క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

రసూల్‌పురా: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 59 ద్వారా స్థలాలు, ఇళ్లను క్రమబద్ధీకరించే అవకాశం కల్పించిందని ఈ అవకాశాన్ని నందమూరినగర్ వాసులు సద్వినియోగం చేసుకోవాలని తిరుమలగిరి మండల తహసీల్దార్ హసినాబేగం సూచించారు. మంగళవారం నందమూరినగర్ కమ్యూనిటీహాల్లో బోర్డు మాజీ సభ్యులు పాండుయాదవ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ముప్పిడి మధుకర్‌తో కలిసి తహసీల్దార్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. బస్తీ వాసులు ఏప్రిల్ ఒకటి నుంచి ముప్పై తేదీ వరకు మీ సేవా కేంద్రాల్లో ఇళ్లు, స్థలాల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పృథ్వీ, ఆర్ఐ కిరణ్‌కుమార్, బస్తీ వాసులు ప్రభాకర్ రెడ్డి, ఉమాకాంత్, శ్రీనివాస్, శ్యామ్‌కుమార్, నరేష్, శివ, రమణ పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చర్లపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి పట్టాలు దాటుతున్న సమయంలో వేగంగా వచ్చిన రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు బ్లూ జీన్స్ ప్యాంటు, తెలుపు, నీలి గల్లా నిండు చొక్కా ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్..

ఆటోను ఢీకొన్న బెంజ్‌కారు

- కోమాలోకి ఆటో డ్రైవర్



లాలాపేట: బెంజ్ కారు ఆటోను ఢీ కొనడంతో ఆటో డ్రైవర్ కోమాలోకి వెళ్లిన సంఘటన ఓయూ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రమేష్ నాయక్ వివరాల ప్రకారం.. అడిగ్‌మెట్ నుంచి తార్నాక వైపు వెళుతున్న బెంజ్ కారు ఇఫ్లూ జంక్షన్ వద్ద ఓ ఆటోను ఢీ కొట్టింది. అంబర్‌పేటకు చెందిన ఆటో డ్రైవర్ దశరథ్(70) ఆటో నుంచి ఎగిరి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. చిక్కడపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా కోమాలోకి వెళ్లినట్లు తెలిపారు. నాగోలుకు చెందిన కారు డ్రైవర్ అన్వేష్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం

చిలకలగూడ : మానసిక రుగ్మతలతో బాధపడుతున్న ఓ మహిళ అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ రమేష్ వివరాల ప్రకారం.. పార్శిగుట్ట న్యూఅశోక్ నగర్‌కు చెందిన మరియమ్మ అలియాస్ ఆదిలక్ష్మీ (50) కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయింది. ఈనెల 23న బయటకు వెళ్లిన మరియమ్మ ఎంతకీ ఇంటికి రాలేదు. పలు ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో మంగళవారం కుమారుడు రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కార్పొరేటర్ ఫసీయుద్దీన్‌పై ఫిర్యాదు

అమీర్‌పేట: మాజీ డిప్యూటీ మేయర్, ప్రస్తుత బోరబండ కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్‌పై ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతడి నుంచి తనకు ప్రాణభయం ఉందని బోరబండ సైట్-1 ఎస్ఆర్ఆర్‌పురంకు చెందిన ఫజల్ వెస్టుజోన్ డీసీపీతో పాటు ఎస్ఆర్‌నగర్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన నివాసం నుంచి కారులో సైట్-1 గేటు వైపు వెళ్తుండగా ఫసీయుద్దీన్ వచ్చి అసభ్య పదజాలంతో దూషించి బెదిరించాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఫజల్ ఫిర్యాదు మేరకు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని, ఇద్దరి మధ్య పాత గొడవలు ఏమైనా ఉన్నాయా అన్నదానిపై ఆరా తీస్తున్నట్లు ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదులు చెప్పారు.

హౌసింగ్ సముదాయానికి మరమ్మతులు చేయండి



సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే కార్యాలయానికి తరలివచ్చిన లంబాడిబస్తీవాసులు

సికింద్రాబాద్: హౌసింగ్ స్కీం ద్వారా తమను నిర్మించిన గృహసముదాయాలకు మరమ్మతులు చేపట్టాలని లంబాడబస్తీ వాసులు కోరారు. మంగళవారం అడ్డగుట్టకు చెందిన సేవాలాల్ లంబాడ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.శ్రీరాంనాయక్ నేతృత్వంలో పలువురు బస్తీవాసులు శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము ఉంటున్న గృహసముదాయాలు కాలక్రమేణా శిథిలావస్థకు చేరుతున్న విషయాన్ని పద్మారావుగౌడ్‌కు వివరించామన్నారు. పై పెచ్చులు ఊడుతుండడం, మెట్లకు రెయిలింగ్ లేకపోవడంతో ప్రమాదకరంగా మారుతున్నాయన్నారు. అదే విధంగా ఆజాద్ చంద్రశేఖర్‌నగర్ పక్కనే ఉన్న తమ కుల దేవత ఆలయం షెడ్డుకు జీహెచ్‌ఎంసీ రూ.4.15 లక్షలు కేటాయించినా పనులు జరుగడం లేదని సదరు నిధులను విడుదల చేయించి షెడ్డును నిర్మించాలని కోరారు.

సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం ముందంజ



చెక్కులు అందజేస్తున్న పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ ముందంజలో ఉందని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ పేర్కొన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని ఐదు డివిజన్లకు చెందిన 191 మందికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం ఆయన అందజేసి మాట్లాడారు. పేద ప్రజలకు ఉపకరించే తరహాలో సంక్షేమ పథకాలు అమలు చేయడంతో తెలంగాణ ప్రభుత్వం అగ్రగామిగా ఉందన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేద ప్రజల వివాహాలకు ఎంతో అండగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి, కార్పొరేటర్లు సామల హేమ, రాసూరి సునీత, కంది శైలజ, నాయకులు శోభన్‌రెడ్డి, తీగుళ్ల కిషోర్, రామేశ్వర్‌గౌడ్, కంది నారాయణ, కరాటే రాజు పాల్గొన్నారు.

పింఛన్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- అధికారులకు మంత్రి తలసాని ఆర్డర్



సమీక్షా సమావేశంలో మంత్రి తలసాని శ్రీనివాస్

సనత్‌నగర్: ఆసరా పింఛన్ల కోసం వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. మాసాబ్‌ట్యాంక్‌లోని తన కార్యాలయంలో సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో అమలవుతున్న ఆసరా పింఛన్లు డబుల్ బెడ్రూమ్ మంజూరు, దళిత బంధు తదితర కార్యక్రమాలపై మంగళవారం సమీక్షించారు. పింఛన్ మంజూరైన వారికి వారం రోజుల్లో కార్డులు పంపిణీ చేయాలన్నారు. పింఛన్ సమస్య సత్వర పరిష్కారం కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. లబ్ధిదారుల వద్ద ప్రభుత్వం అందించిన యూనిట్లు ఉన్నాయా.. సక్రమంగా వినియోగిస్తున్నారా? లేదా పర్యవేక్షణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి పరిశీలించాలన్నారు. నియోజకవర్గ పరిధిలో నీటి అవసరాలను తీర్చడం కోసం తమ నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి బోర్‌వెల్స్ ఏర్పాటు చేస్తున్నా, వివిధ కారణాలతో సకాలంలో విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో జాప్యం జరుగుతుందని, వాటిని ప్రజలకు వినియోగంలోకి తీసుకురావడం ఆలస్యం అవుతుందన్న ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇకముందు అలా జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

◆ నియోజకవర్గ పరిధిలో ఒక్కో డివిజన్ రెండు, మూడు మండలాల పరిధిలో ఉన్నాయని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఒకే మండల పరిధిలోకి వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కలెక్టర్ అమయ్ కుమార్, ఆర్డీఓ వసంత, తహసీల్దార్లు శైలజ, విష్ణుసాగర్, అన్వర్ హుస్సేన్, అయ్యప్ప, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్, హౌసింగ్ ఈఈ వెంకటదాసు రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం..

రాంగోపాల్‌పేట్: మోండా డివిజన్‌లోని రైల్నిలయం వెనుక వైపుగల అంబేడ్కర్‌నగర్‌లో ఫుట్‌పాత్, సీసీరోడ్డు నిర్మాణ పనులు, సెకండ్‌బజార్‌లో మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను మంత్రి తలసాని కార్పొరేటర్ కొంతం దీపిక, దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తె లాస్య నందితతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోండా డివిజన్‌తో పాటు కంటోన్మెంట్ నియోజకవర్గంలో కూడా అభివృద్ధి పనులు ఆగకుండా ముందుకు కొనసాగిస్తామన్నారు. .

ప్రొటోకాల్ రగడ..

తన డివిజన్‌లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు తనకు సరైన సమాచారం అందించడం స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 30వ తేదీ ప్రారంభోత్సవాలు ఉన్నాయని చెప్పారని కానీ మళ్లీ నేటికి వాయిదా వేసి తనకు సమాచారం ఇవ్వలేదన్నారు. కార్యకర్తల ద్వారా తెలుసుకుని వచ్చే సరికి 5 నిమిషాలు కూడా ఆగకుండా ప్రారంభోత్సవం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.